క్లుప్తంగా

15న చలో విజయవాడ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : విభజన చట్టంలోని హామీల సాధన కోసం, అసమానతలు లేని రాష్ట్రాభివృద్ధి కోసం, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం ఈనెల 15న జరిగే సీపీఎం చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని సీపీఎం నగర కమిటీ సభ్యులు డీఎం ఓబులేసు, డాక్టర్ ఎజాస్ అహ్మద్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని ఫయాజ్ హాస్పిటల్‌లో చలో విజయవాడ కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు విజయ్, జగదీష్ ,ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో కూడిన ఉపాధి కల్పించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సులో నాలుగు నెలలపాటు శిక్షణ ఇస్తామన్నారు. అభ్యర్థులు 19-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఇంటర్మీడియేట్ పాస్, డిగ్రీ పాస్/ ఫెయిల్, నర్సింగ్ డిప్లొమా పాస్/ ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. శిక్షణాకాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. శిక్షణా కాలంలో వ్యక్తిత్వ వికాసం, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీషులలో కూడా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈనెల 9 నుంచి నూతన బ్యాచ్ ప్రారంభమవుతుందని, ఆసక్తిగల వారు ఫీల్డ్ కోఆర్డినేటర్ 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్‌ను జయప్రదం చేయాలి

కడప ఎడ్యుకేషన్: కడప యూటీఎఫ్ భవన్‌లో ఈనెల 19వ తేదీన నిర్వహించనున్న జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్ బాబులు పిలుపునిచ్చారు. సోమవారం కడప యూటీఎఫ్ భవన్‌లో జిల్లా కౌన్సిల్ సమావేశాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, సుజాతరాణి, జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు రమణ, చంద్ర ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాయిద్య కళాశాలను ఏర్పాటు చేయాలి

కడప రూరల్ : నాయీ బ్రాహ్మణుల కోసం జిల్లాలో వాయిద్య కళాశాలను ఏర్పాటు చేయాలని వాయిద్య కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు చెన్నప్ప, ప్రధాన కార్యదర్శి ఎగువ గడ్డ రంగయ్య కోరారు. ఆ మేరకు సోమవారం ఆర్డీఓ మధుసూదన్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు వాయిద్య కళాకారులుగా జీవనం సాగిస్తున్నారని అన్నారు. ఈ వాయిద్య కళ అంతరించిపోకుండా కడప నగరంలో ఒక వాయిద్య కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు.

యువకుడిపై దాడి

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మాసాపేటలో వుంటున్న కీర్తన్ (17) అనే యువకుడిని చుట్టుపక్కల పిల్లలతో కలిసి వీధిలో అల్లరి చేస్తున్నాడని అదే ప్రాంతానికి చెందిన హేమంత్ రాయితో కొట్టాడు. గాయపడిన కీర్తన్ తన తండ్రి డేవిడ్ సాయంతో ఆసుపత్రిలో చేరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంజీవరాయుడు తెలియజేశారు.

పక్కా గృహాలు మంజూరు చేయాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న చిలంకూరు ఎస్టీ కాలనీ వాసులు

కడప సెవెన్‌రోడ్స్ : ఎర్రగుంట్ల మండలం చిలంకూరు గ్రామ యానాదులకు పక్కా గృహాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామ్మోహన్, అన్వేష్‌లు డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. చిలంకూరు ఎస్టీ కాలనీలో తొమ్మిదేళ్ల క్రితం 19 కుటుంబాలు పునాదులు వేసుకున్నా ఇప్పటికీ అధికారులు పక్కా గృహాలు మంజూరు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీకి చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్



జూదరుల అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న కడప చిన్నచౌక్ సీఐ పి. నరసింహారెడ్డి

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పాతబైపాస్ రోడ్డులో జూదమాడుతున్న ఉదయగిరి రాజా, మరో ఇద్దరు కలిసి మంగతాయా అనే జూదం ఆడుతుండగా సీఐ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ రవికుమార్ తమ సిబ్బందితో కలిసి సోమవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 7040 నగదుతో పాటు 52 పేకముక్కలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా మట్కా, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠినచర్యలు తప్పవన్నారు.

జగనన్న వేసిన అడుగులు ప్రజల జీవితాల్లో వెలుగులు

ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు



కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : ప్రతిపక్షనేతగా ప్రజా సంకల్ప యాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేసిన అడుగులు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. సోమవారం పాదయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక హెడ్‌పోస్టాఫీసు వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి గజమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరినొకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ భారత దేశ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయానికి ప్రజాసంకల్పయాత్ర శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజా సంకల్పయాత్ర చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోట్లాదిమంది ప్రజల కష్టసుఖాలను ప్రత్యక్షంగా చూసి తెలుసుకున్నారన్నారు. వైఎస్ జగన్‌పై విశ్వాసముంచిన ప్రజలు దేశంలో కనీ వినీ ఎరుగని రీతిలో 151 అసెంబ్లీ స్థానాలు వైఎస్సార్‌సీపీకి కట్టబెట్టారన్నారు. ప్రజల కష్టాలను తీర్చేందుకు నవరత్నాల రూపంలో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రతి కుటుంబానికి మేలు చేశారన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు రాష్ట్రాన్ని పాలించినా ఎన్నికల మేనిఫెస్టో అమలు చేసిన ఘనత డా. వైఎస్సార్, వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్ర సాహసోపేతమైనదని, ఎండా, వానా, చలి వేటినీ లెక్క చేయకుండా కొన్ని నెలలపాటు ఆయన కుటుంబానికి దూరంగా ఉండి ప్రజలతో మమేకమయ్యారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి తు.చ తప్పకుండా అమలు చేశారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్‌వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, పార్టీ నాయకులు జయచంద్రారెడ్డి, సుభాన్ బాషా, సీహెచ్ వినోద్, మేసా ప్రసాద్, దత్తసాయి, మునిశేఖర్‌రెడ్డి, తోటక్రిష్ణ, పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, ఉమామహేశ్వరి, బండి మరియలు, రత్నకుమారి, మల్లీశ్వరి, జింకా విజయలక్ష్మి, తులశమ్మ, పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం

కడప కార్పొరేషన్ : ప్రజా సంక్షేమమే పరమావధిగా 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాష అన్నారు. సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా.. 3వ డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వార్డులోని అన్ని ఇళ్లకు తిరుగుతూ వారు పొందుతున్న లబ్ధి సమాచారంతో కూడిన ముఖ్యమంత్రి సంతకం చేసిన బుక్ లెట్‌ను అందజేశారు. బట్టల మంగమ్మ అనే మహిళ మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తమకు ఇంటి స్థలం, ఇంటిని నిర్మించుకోవడానికి నగదు, వైఎస్ఆర్ పింఛన్ కానుక, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా రూ.9,62,786 లబ్ధి చేకూరిందని సంతోషం వ్యక్తం చేసింది. చల్లా పద్మావతి అనే మహిళ మాట్లాడుతూ జగనన్న అమ్మఒడి, ఆరు లక్షల విలువచేసే ఇంటి స్థలం, ఇల్లు నిర్మించుకోవడానికి నగదు.. మొత్తం రూ.8,79,000 రాష్ట్ర ప్రభుత్వం అందించిందని ఆనందం వ్యక్తం చేసింది.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

శ్రీరాంనగర్ కాలనీలో మున్సిపల్ జనరల్ ఫండ్స్ నుండి రూ. 30 లక్షల అంచనా వ్యయంతో 2సీసీ రోడ్ల నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో 3వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ సుదర్శన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, బండి ప్రసాద్, ఎస్. సుబ్బారెడ్డి, ఆర్.చెన్నయ్య, గోపాలక్రిష్ణ, నాగేంద్ర, తోటక్రిష్ణ, రామ్మోహన్‌రెడ్డి, లక్ష్మినారాయణ, షఫీవుల్లా, మియా, కార్పొరేటర్స్ బండి ప్రసాద్, చెన్నయ్య, నారాయణమ్మ, జింకా జయలక్ష్మి పాల్గొన్నారు.

అకడమిక్ క్యాలెండర్‌ను పక్కాగా పాటించాలి



విద్యార్థి నోట్ బుక్‌ను పరిశీలిస్తున్న పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ప్రతి ఉపాధ్యాయుడు అకడమిక్ క్యాలెండర్‌ను పక్కాగా పాటించాలని, దాని ప్రకారమే బోధనలు ఉండాలని పాఠశాల విద్య ఆర్‌జేడీ మార్తాల వెంకట కృష్ణారెడ్డి ఆదేశించారు. సోమవారం కడప నాగరాజుపేట నగరపాలక ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, ఎంఈఓ పాలెం నారాయణలతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించడంతోపాటు ఉపాధ్యాయుల లెసన్‌ప్లాన్, టీచర్స్ డైరీలను పరిశీలించారు. అలాగే విద్యార్థుల నోట్‌బుక్స్, వర్కు బుక్స్‌ను ఉపాధ్యాయులు కరెక్షన్ చేసింది లేనిది తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రొగ్రెస్ కార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉనికిని కాపాడుకునేందుకే విమర్శలు

కడప కార్పొరేషన్ : తన ఉనికిని కాపాడుకునేందుకే బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పురందేశ్వరి తాను బీజేపీ అధ్యక్షురాలునని మర్చిపోయి టీడీపీ గౌరవాధ్యక్షురాలిగా భావించి విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మద్యం డిస్టలరీలకు చంద్రబాబు హయాంలోనే అనుమతులు ఇచ్చారని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఏ ఒక్క డిస్టిలరీకి అనుమతి ఇవ్వలేదని తెలిపారు. ఎంపీ విజయసాయి రెడ్డి బెయిల్ రద్దు చేయాలని ఆమె సుప్రీంకోర్టుకు లేఖ రాయడం దారుణమన్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడవడంలో బాబుకు పురందేశ్వరి కూడా సహకరించాలని ఆరోపించారు.

నగరంలో ఎల్‌జీ మెగా మేళా ప్రారంభం



మెగా మేళా సందర్భంగా ఏర్పాటు చేసిన ఎల్‌జీ ఉత్పత్తులు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో మద్రాసు రోడ్డులోని అమరస్వామి ఫంక్షన్ హాలులో ఎల్‌జీ మెగా మేళా అట్టహాసంగా ప్రారంభమైనట్లు జూటూరు ఏజెన్సీస్ అధినేత జూటూరు మధుసూదన్‌రావు తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకొని ఈనెల 6వ తేది నుంచి 15వ తేది వరకూ ఈ మెగా మేళా కొనసాగుతుందన్నారు. ఈ మేళాలో ఎల్‌జీ కంపెనీకి సంబంధించిన అన్ని ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం జరుగుతుందన్నారు. ప్రతి కొనుగోలుపై గోల్డ్ కాయిన్, వివిధ రకాల బహుమతులు గెలుచుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. అలాగే బంపర్ డ్రా కింద ఆడి కారు గెలుచుకునే సౌలభ్యం ఉందన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఖలీల్‌బాష కుటుంబంపై విమర్శలు తగవు

కడప కల్చరల్ : మాజీమంత్రి డాక్టర్ ఎస్ఏ ఖలీల్ బాష కుటుంబంపై అవినీతి ఆరోపణలు తగవని వైఎస్సార్ సీపీ నాయకులు చెన్నంశెట్టి మురళీకృష్ణ అన్నారు. కడప నగరంలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కృష్ణా సర్కిల్ వద్దగల యాకుబ్‌సాహెబ్ మసీదుకు సంబంధించి 29 గదుల నిర్మాణానికి 1999లో వక్ఫ్ బోర్డు ద్వారా డాక్టర్ ఖలీల్‌బాష రూ. 25 లక్షలు రుణాన్ని ఇప్పించారని తెలిపారు. 2017లో తీరిపోయిందని తెలిపారు. 2011 నుంచి ఇప్పటివరకు రూ. 15,48,861 బాడుగలు పంజాబ్ నేషనల్ బ్యాంకులో కార్యదర్శి మహబూబ్‌బాష, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ పేరుతో జాయింట్ అకౌంటుకు జమ కాగా, దీంతో రుణం తీర్చి మిగిలిన రూ. 3,35,000 ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా వేశారని తెలిపారు. ఇంకా రూ. 1.50 లక్షల వరకు గదుల అద్దె బకాయిలు ఉన్నాయన్నారు. ఈ నిజాలు తెలియని కొందరు టీడీపీ నాయకులు ఖలీల్‌బాష కుమారులు గదుల అద్దెలు వసూలు చేస్తున్నారని తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమన్నారు.

జాగ్రత్తలు పాటించి పంటను కాపాడుకోవాలి



మినుము పంటను పరిశీలిస్తున్న ఉద్యాన సలహాదారు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం: రైతులు వ్యవసాయాధికారులు అందించే సలహాలు, సూచనలు, జాగ్రత్తలు పాటించి పంటలను కాపాడుకోవాలని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని టి.చదిపిరాళ్ల, గొళ్లపల్లె గ్రామాల పొలాల్లో సాగులో ఉన్న మినుము పంటను వ్యవసాయాధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సెప్టెంబర్ నెలలో వర్షాలు కురవడంతో రబీ సీజన్‌లో భాగంగా అత్యధికంగా మినుము పంట సాగు చేశారన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండి పోయే అవకాశం ఉందన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత బెట్ట పరిస్థితులను తట్టుకోవడానికి నెలలోపు మినుము పంటకు పురుగు నివారణ మందులతోపాటు లీటర్ నీటికి 5 గ్రాముల 19-19-19ను కలిపి పిచికారి చేయాలన్నారు. నెల తర్వాత పైరుకు పురుగు నివారణ మందులతోపాటు లీటర్ నీటికి 5 గ్రాముల 13-0-45ను కలిపి పిచికారి చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల మొక్కకు త్వరగా పోషకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ సరస్వతి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, భాస్కర్, జగన్ మోహన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, చిన్ని, మైసూరారెడ్డి, సురేష్, ఏఈఓ దస్తగిరి, వీఏఏ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కడప అర్బన్ : కడప నగరంలోని రిమ్స్ పోలీసు స్టేషన్ పరిధిలో జడ్జి బంగళా సమీపంలో ఉన్న కూడలి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కడప నగరానికి చెందిన విష్ణు(25), పవన్(24)అనే ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రిమ్స్ రోడ్డుమార్గంలో అటు వైపు నుంచి వస్తున్న కారును, కూడలి వద్ద మోటార్‌సైకిల్‌లో వేగంగా వచ్చిన ఇద్దరు యువకులు కారుకు కుడివైపున ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని వెంటనే 108లో రిమ్స్‌కు తరలించారు.ఈ సంఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

8న ఇంటర్వ్యూ

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో లైబ్రేరియన్‌గా పనిచేసేందుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులకు ఈనెల 8న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా తెలిపారు. ఎంఎల్ఐఎస్సీలో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. ఏపీసెట్, నెట్, పీహెచ్‌డీ, కంప్యూటర్ నందు ఎంఎస్ ఆఫీసర్ పరిజ్ఞానం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులతో ప్రిన్సిపాల్ కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు.

ఉత్కంఠగా బండలాగుడు పోటీలు

మైదుకూరు : మున్సిపాలిటీలోని తిమ్మాయపల్లెలో అవధూత కొండయ్య స్వామి జన్మదిన వేడుకల్లో భాగంగా సోమవారం నిర్వహించిన బండలాగుడు పోటీలు ఉత్కంఠగా జరిగాయి. జాక్‌పాట్ విభాగంలో నిర్వహించిన బండలాగుడు పోటీల్లో విజేతలకు నగదు బహుమతులను నిర్వాహకులు అందించారు. మంగళవారం చిన్న బండలాగుడు పోటీలు, మనుషులు గుండు ఎత్తే పందెం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కార్తీక మాసోత్సవాలకు ప్రత్యేక బస్సులు

బద్వేలు అర్బన్ : కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 19, 26, డిసెంబర్ 3, 10వ తేదీల్లో బద్వేలు డిపో నుంచి వివిధ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరుణాచలం, మహానంది, ఓంకారం, శ్రీశైలం, కాశినాయన క్షేత్రం, సిద్దేశ్వరం, భైరవకోన, నారాయణస్వామి మఠం, నర్రవాడ, లంకమల, నిత్యపూజకోన, పొలతల క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9959225779 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా దస్తగిరిస్వామి జెండా పండుగ

దువ్వూరు : దస్తగిరిస్వామి జెండా పండుగను సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి 9 గంటలకు గ్రామంలోని పురవీధుల్లో వేళతాళాలతో ఫకీర్ల విన్యాసాలతో జెండాను ఊరేగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమలాపురం గఫరియా దర్గా పీఠాధిపతి జహురుద్దీన్ షా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు దర్గా కమిటీ సభ్యులు ప్రసాదం పంపిణీ చేశారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్ చంద్ అన్నారు. సోమవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో భాగంగా కడప నగర పాలక సంస్థ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజలు ఇచ్చినటువంటి అర్జీలను పరిశీలిస్తూ శాఖధిపతులతో చర్చించి, అన్ని అర్జీలను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. మరియాపురం వద్దనున్న సర్కిల్‌లో క్రైస్తవ మతానికి చెందిన క్రీస్తు శిలువ స్తూపం నమూనా ఏర్పాటు చేయాలని హోలీ జీసస్ క్రైస్ట్ చర్చి బిషప్ రెవ. డా. కె. శామ్యూల్ బాబు కోరారు. కమిషనర్‌కు ఫాదర్లు వినతి పత్రం సమర్పించారు. ఇందులో మొత్తం 45 అర్జీలు రాగా టౌన్ ప్లానింగ్ విభాగం అర్జీలు 14, ఇంజనీరింగ్ విభాగం-12, రెవెన్యూ విభాగం- 6, హెల్త్ విభాగం- 5, యూసీడీ విభాగం -3, సచివాలయ విభాగం- ఒకటి, తహసీల్దార్ కడప-1, తహసీల్దార్ సీకేదిన్నె-2, హౌసింగ్ విభాగం-1 అర్జీ వచ్చింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దీపావళి ఆనందంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రమాదాలకు తావు లేకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు డివిజన్లలో బాణసంచా దుకాణాలకు లైసెన్స్ ఇస్తామన్నారు. ధ్వని కాలుష్య నియంత్రణకు అధికారులు కృషి చేయాలన్నారు. నియమ నిబంధనలు, అన్ని రకాల భద్రతా చర్యలు తప్పక పాటించేలా చూడాలన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా బాణసంచా దుకాణాలు నిర్వహించరాదన్నారు. అలా ఎవరైనా ఏర్పాటు చేస్తే సీజ్ చేయాలని చెప్పారు. ఆర్డీఓలు వారంలోగా అన్ని గోడౌన్లను, స్టాల్స్‌ను పరిశీలించాలన్నారు. విద్యుత్, అగ్నిమాపక, పోలీసు, మున్సిపల్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి షాపు ఎదుట ధరల పట్టిక ప్రదర్శించాలన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జీఎస్టీ జాయింట్ కమిషనర్ కల్పన, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, డీఆర్వో గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జయనగర్ హైస్కూల్ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఈ నెల 9వ తేదీ జరగనున్న రాష్ట్రస్థాయి బ్యాస్కెట్ బాల్ పోటీలకు కడప నగరం జయనగర్‌కాలనీ జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యవతి తెలిపారు. వీరు ఈనెల 4వ తేదీన కడపలోని విద్యామందిర్ పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి ఆటల పోటీల్లో పాల్గొని అండర్ 14, అండర్ 17 బాలికల విభాగంలో ఉత్తమ ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇందులో అండర్ 14 బాలికల విభాగంలో చంద్రమౌనిక, వెంకట మౌనిక, హర్షిని, నందిని, సింధు, రెడ్డిసాయి, శరణ్య దేవి, అమృతవర్షనిలు, అండర్ 17 బాలికల విభాగంలో అర్చనచంద్రిక, రజియా, రిజ్వానా, మాబి, ప్రసున్న సాయి కళలు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలికలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్యమతి, పీడీ వెంకటసుబ్బమ్మ, ఉమా మహేశ్వరిలు అభినందించారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నవంబరు 27, 28 తేదీలలో విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు పిలుపునిచ్చారు. వామపక్ష కార్మిక రైతు సంఘాల జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సోమవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఓబులేశు మాట్లాడుతూ రైతులు, పేదలు,కార్మికులు, సామాన్య ప్రజల ప్రయోజనాలను నరేంద్ర మోడి ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జి చంద్ర, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి మనోహర్ అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

సేవాతత్పరతకు నిదర్శనం ఎన్‌ఎస్‌ఎస్



ఎన్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : సమాజ ప్రయోజనాల కోసం పాటుపడే ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవాతత్పరతకు నిదర్శనమని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా జాతీయస్థాయిలో, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ విశ్వవిద్యాలయ ఖ్యాతిని వలంటీర్లు చాటిచెబుతున్నారన్నారు. సమాజంలో భాగస్వాములై ప్రజల అవసరాలను గుర్తించి పరిష్కార మార్గాలను చూపాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకటరామిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆచార్య అనిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలానా జయంతి నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్ : దేశవ్యాప్తంగా నవంబర్ 11వ తేదీన నిర్వహించే మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలను ప్రతి పాఠశాలలో నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ నాయకులు అఫ్జల్‌ఖాన్ అన్నారు. సోమవారం రాయల్ కరీం సేవా సమితి ఆధ్వర్యంలో తయారు చేసిన ఆజాద్ పోస్టర్లను వారి కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి విద్యాశాఖ మంత్రిగా సేవలందించిన ఆజాద్ జీవిత విశేషాలు విద్యార్థులకు తెలియ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కే సంస్థ అధినేత అబ్దుల్ రాయల్ కరీముల్లా పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

చింతకొమ్మదిన్నె : చామంతి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యాన శాఖ అధికారిణి కె.జ్యోతిర్మయి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో చామంతి సాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చామంతి రకాల ఎంపిక, తెగుళ్లు, సూక్ష్మ పోషకాల లోపాలు, పూల నాణ్యత, దిగుబడి పెంచడం కోసం తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. హార్మోన్ల వాడకం ద్వారా పూల కోతను మార్కెట్ డిమాండ్‌ను బట్టి, ఆలస్యం లేదా త్వరగా కోతకు వచ్చేలా చేయడం, సస్యరక్షణ, నారు శుద్ధి, ట్రైకోడర్మా ప్రాముఖ్యత, పూలలో నిల్వ శాతం పెంచడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త మానస, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బృందానికి సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్

వల్లూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2022- 23 ఆర్థిక సంవత్సరంలో వల్లూరు మండల పరిధిలో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ జరగనుందని, తనిఖీ బృందానికి ఉపాధి హామీ సిబ్బంది పూర్తిస్థాయిలో సహకరించాలని ఎంపీడీవో కేఆర్‌ఎమ్ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఉపాధి హామీ సిబ్బంది, సామాజిక తనిఖీ బృంద సభ్యులకు సోమవారం జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో జరిగిన పనులన్నింటినీ తనిఖీ బృందానికి చూపించడమే కాక వాటికి సంబంధించిన రికార్డులతోపాటు పూర్తి వివరాలను అందజేయాలని అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామ సభలను నిర్వహించాలని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులతోపాటు పెన్షన్ల పంపిణీ, పంచాయతీ రాజ్ పనులను పరిశీలించడం జరుగుతుందని డ్వామా డీవీవో యోగాంజనేయరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవోలు సుధారాణి, పార్థసారథి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ముజీబ్, పీఆర్ ఏఈ పవన్ కుమార్, ఎస్ఆర్‌పీ లక్ష్మినారాయణ, ఈసీలు అన్నా నాయక్, అంజలి, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, డీఆర్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.